# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

teluguprabha.net

-TeluguPrabha

@TeluguPrabhaofficial

TS వైబ్రెంట్ ఎడిషన్ 4 pm

సోమవారం 7-8-2023


## ఇక సెలవ్..

పల్లె పల్లెను తట్టి లేపిన ఆ గద్గధ స్వరం..
ఇక శాశ్వతంగా మూగబోయింది.
ఘల్లు ఘల్లు మంటూ పీడిత జన ఘోషను
ప్రపంచానికి చాటిన ఆ చప్పుళ్ళు
దివికేగాయి.
జోహార్ గద్దరన్నా.. జోహార్.. జోహార్.. అని
ఊరు వాడ నినదిస్తుండగా..
ఏ తుపాకీ గుళ్ళు గుండెల్లోకి
దూసుకెళ్ళాయో.. ఇప్పుడవే తుపాకీ గుళ్ళు
సలాం చేస్తుండగా.. ఇక సెలవ్ అంటూ
అమరుడయ్యారు.. గుమ్మడి విఠల్
రావు అలియాస్ గద్దర్.
కానీ.., గజ్జె కట్టిన ప్రతీ
ఆటలో..
ధ్వనించే విప్లవ గీతంలో..
స్మరించే ప్రతీ
కళాకారుడి గుండెల్లో..
చిరస్మరణీయుడుగా
నిలిచిపోయారు.



# వెళ్లొస్తా... పాటనై పొద్దు పొడుస్తా..

**గద్దర్‌కు జన నీరాజనం**
**అంతిమయాత్రలో భారీగా జనం**
**నివాళులు అర్పించిన ప్రముఖులు**

**హైదరాబాద్, ఆగస్ట్ 7(తెలుగుప్రభ):**

అల్వాల్ భూదేవి నగర్‌లోని మహాభోది విద్యాలయంలో అధికారిక లాంఛనాలతో గద్దర్ అంత్యక్రియలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. విద్యాలయం వెనుక సమాధి కోసం గద్దర్ కుమార్తె వెన్నెల దగ్గరుండి చూసుకున్నారు. గద్దర్ అంతిమయాత్రకు కవులు, కళాకారులు, అభిమానులు, ప్రజాప్రతినిధులు తరలివచ్చారు. భారీ సంఖ్యలో సాధారణ పౌరులు సైతం తరలివచ్చారు. దారి పొడవునా ఆయన పార్థీవ దేహానికి నివాళి అర్పించారు. అంత్యక్రియలు నిర్వహించే అల్వాల్‌కు తరలివచ్చారు.

### పార్టీలకతీతంగా నివాళి

అంత్యక్రియలకు ముందు ప్రజల సందర్శనార్థం ఎల్‌బీస్టేడియంలో ఉంచిన గద్దర్ పార్థివదేహాన్ని సందర్శించిన పలువురు ప్రముఖులు ఆయనకు నివాళులు ఘటించారు. ఇవాళ నివాళులర్పించిన వారిలో సుప్రీంకోర్టు మాజీ సీజే ఎన్వీరమణ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, గరికపాటి నర్సింహారావు, రెండు రాష్ట్రాల మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎర్రబెల్లి దయాకరరావు, బొత్స సత్యనారాయణ, టీఎస్‌ఆర్టీసీ ఎండి సజ్జనార్, మాజీ శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు దానం నాగేందర్, చంటి క్రాంతికిరణ్, కాంగ్రెస్ నాయకులు రేవంత్‌రెడ్డి, ఆపార్టీ నేతలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మాణిక్‌రావు ఠాక్రే, జానారెడ్డి, సీతక్క, అంజనీకుమార్‌యాదవ్,భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, జీవన్‌రెడ్డి, ఇతర ప్రముఖులు అజారుద్దీన్, బూర నర్సయ్య గౌడ్, నటుడు మోహన్‌బాబు, బండ్ల గణేశ్, మధుప్రియ, బీఎస్పీ చీఫ్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, తదితరులున్నారు. కళాకారులు పెద్దయెత్తున ఎల్‌బీ స్టేడియం చేరుకొని పాటలతో విప్లవ వీరునికి ఘనంగా నివాళులర్పిస్తున్నారు.





### జన నీరాజనం

గద్దర్ అంతిమయాత్రకు కవులు, కళాకారులు, అభిమానులు, ప్రజాప్రతినిధులు తరలివచ్చారు. భారీ సంఖ్యలో సాధారణ పౌరులు సైతం తరలివచ్చారు. దారి పొడవునా ఆయన పార్థీవ దేహానికి నివాళి అర్పించారు. అంత్యక్రియలు నిర్వహించే అల్వాల్‌కు తరలివచ్చారు.

---

## నడుంపై చేయి వేశాడు.. దుస్తులు చింపేసి కొట్టాడు..

### మద్యం మత్తులో.. మహిళను వివస్త్రను చేసి

**హైదరాబాద్, ఆగస్ట్ 7(తెలుగుప్రభ):**

నగర శివార్లలోని జవహర్‌నగర్‌లో కూలి పనులు చేసుకునే పెద్దమారయ్య (30) ఆదివారం రాత్రి మద్యం మత్తులో దారిలో కనిపించిన యువతి(28)ని చూసి ఆమెపై చెయ్యివేసి అసభ్యంగా ప్రవర్తించాడు. హతాశురాలైన ఆమె ఆగ్రహంతో బలంగా నెట్టివేసింది. విచక్షణ కోల్పోయిన మారయ్య ఆమెపై దాడికి పాల్పడ్డాడు. బలవంతంగా ఆమె దుస్తుల్ని చించివేశాడు. అటుగా బైక్‌పై వచ్చిన మహిళ అడ్డుకోబోగా ఆమెపైనా దాడికి ప్రయత్నించాడు. దాదాపు పావుగంట సేపు యువతి వేదన అరణ్యరోదనే అయింది. మారయ్య వెళ్లిపోయాకే కొందరు అక్కడకు చేరుకొని కవర్లతో ఆమె ఒంటిని కప్పి పోలీసులకు సమాచారమిచ్చారు. జవహర్‌నగర్ పరిధి బాలాజీనగర్ పాత పంచాయితీ వద్ద షాపింగ్‌కు వెళ్లి వస్తుంటే మారయ్య నడుం మీద చేయి వేశాడని, ప్రతిఘటిస్తే దుస్తులు చింపేసి కొట్టాడని బాధితురాలు వాపోయింది.






## ఓటరు జాబితా పారదర్శకంగా ఉండాలి

### కమిషనర్ రోనాల్డ్ రోస్

**హైదరాబాద్, ఆగస్ట్7 (తెలుగుప్రభ)**

హైదరాబాద్ జిల్లాలో ఓటింగ్ వంద శాతం పెరిగేలా, నగర వ్యాప్తంగా పారదర్శకమైన ఓటరు జాబితాను రూపొందించాలని బీఎల్‌ఓలు, ఇఆర్‌ఓ, ఆర్‌ఓలను జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ ఆదేశించారు. జాబితా దోష రహితంగా ఉండాలన్నారు. సంస్థ ప్రధాన కార్యాలయంలో రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, ఆర్.ఓ, ఇ.ఆర్.ఓ లతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ సీఈఓ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఓటరు జాబితాలో కొత్త ఓటరు నమోదు, డెత్, షిఫ్టింగ్‌లను ఫారం–6, ఫారం–7, ఫారం–8 ల ద్వారా చర్యలు తీసుకునేందుకు రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సహకరించాలని తెలిపారు. ఓటరు నమోదుకు తప్పనిసరిగా మొబైల్, ఆధార్ నెంబర్లను అనుసంధానం చేయాలని తెలిపారు. పోలింగ్ స్టేషన్ వారీగా ఇంటి నెంబర్ ల డ్రాఫ్ట్ ను ప్రచురణ చేస్తామని తెలిపారు. ఓటర్లు ఓటర్ హెల్ప్ లైన్, సీఈఓ వెబ్ సైట్, ఎలక్షన్ కమిషన్ టోల్ ఫ్రీ నెంబర్ 1950 ద్వారా తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. ఫైనల్ ఓటరు జాబితాను ప్రతి పోలింగ్ స్టేషన్‌లో, బీఎల్‌ఓ వద్ద, వార్డు ఆఫీస్ లో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. పోలింగ్ రోజు ఓటరు తమ పేరును ఓటరు జాబితాలో ఉండి భారత ప్రభుత్వం సూచించిన 12 గుర్తింపు కార్డులలోఏదో ఒకటి కలిగి ఉండాలని తెలిపారు. ఓటర్లుతమ ఓటరు గుర్తింపు కార్డును నేరుగా ఆన్ లైన్ ద్వారా డౌన్ లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఓటరు జాబితాలో ఎటువంటి తప్పిదాలు జరుగకుండా ప్రత్యేకంగా క్యాంపెన్ లతో పాటు రద్దీ ఉన్న ప్రదేశాలలో, బస్ బే లు, రైల్వే స్టేషన్లలో, ప్రార్థన స్థలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో కంటోన్మెంట్ ఆర్.ఓ, ఎన్నికల అధికారి శంకరయ్య, జాయింట్ కమిషనర్ మంగతాయారు, ఆర్.ఓ, ఇ.ఆర్.ఓ లు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హమ్మయ్యా.. వనమాకు బిగ్ రిలీఫ్..

**హైదరాబాద్, ఆగస్ట్7 (తెలుగుప్రభ)**



కొత్తగూడెం ఎమ్మెల్యేగా వనమా వెంకటేశ్వరరావు ఎన్నిక చెల్లదని తెలంగాణ హైకోర్టు ఇటీవల సంచలన తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. హైకోర్టు తీర్పుపై వనమా సుప్రీం కోర్టును ఆశ్రయించారు. కొత్తగూడెం ఎమ్మెల్యేగా తన ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దేశ అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. వనమా పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్త ధర్మాసనం ఇవాళ విచారణ జరిపింది. వనమాకు ఊరటనిస్తూ.. హైకోర్టు ఇచ్చిన అనర్హత వేటుపై సుప్రీం ధర్మాసనం స్టే విధించింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన న్యాయస్థానం.. రెండు వారాల్లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

## చేనేత భవన నిర్మాణానికి శంకుస్థాపన

**హైదరాబాద్, ఆగస్ట్7 (తెలుగుప్రభ)**

జాతీయ చేనేత దినోత్సం సందర్భంగా ఉప్పల్ శిల్పారామంలో చేనేత భవన్ నిర్మాణానికి మంత్రి కేటీఆర్ శంకుస్థాన చేశారు. మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ ఎల్.రమణతో కలిసి చేనేత భవన్ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. 500 గజాల స్థలంలో దీనిని నిర్మిస్తున్నారు. అదేవిధంగా చేనేత వస్త్రాల వ్యాపార నిర్వహణ, క్రయవిక్రయాదారుల సమావేశాలు, సదస్సుల నిర్వహణ కోసం చేనేత కన్వెన్షన్ సెంటర్‌ను నిర్వహించనున్నారు.



## శ్రేణులకు మోదీ దిశా నిర్దేశం

### ఏం చెప్పారంటే..

**న్యూఢిల్లీ, ఆగస్ట్7 (తెలుగుప్రభ)**



కాంగ్రెస్ హయాంలో గ్రామ పంచాయతీల అభివృద్ధిని విస్మరించారని విమర్శించారు ప్రధాని మోడీ. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నాలుగు దశాబ్దాలైనా.. పంచాయతీరాజ్ వ్యవస్థ ఆవశ్యకతను కాంగ్రెస్ తెలుసుకోలేకపోయిందన్నారు. కాంగ్రెస్ హయాంలో గ్రామాల్లో అభివృద్ధి పేపర్లకే పరిమితమైందన్న ప్రధాని.. అందుకు జమ్మూకశ్మీర్ ఉదాహరణ అని తెలిపారు. హర్యానాలో బీజేపీ క్షేత్రీయ పంచాయతీరాజ్ పరిషత్ రెండు రోజుల కాన్ఫరెన్స్‌లో బీజేపీ నేతలకు దిశానిర్దేశం చేశారు ప్రధాని మోడీ. 2047 వరకు గ్రామాలు కూడా పూర్తిస్థాయి అభివృద్ధి చెందేలా పనిచేయాలని.. గ్రామస్థాయిలో సమస్యలు తెలుసుకునేందుకు ప్రజలతో మమేకం అవ్వాలని సూచించారు.

## అంతరిక్షంలోనూ ట్రాఫిక్ జామ్..

**శ్రీహరికోట, ఆగస్ట్7 (తెలుగుప్రభ)**



రోడ్లపైనే కాదు.. అంతరిక్షంలోనూ ట్రాఫిక్ జామ్ ఏంటి అనుకుంటున్నారా.. ఇది నిజం. శాస్త్రవేత్తలు ఆధారాలతో సహా చెబుతున్నారు. అయితే.. అక్కడ ట్రాఫిక్ జామ్ వాహనాల వల్ల కాదు.. వ్యర్థాల వల్ల. ఇస్రో దీనిపై ఇటీవల ఓ స్టడీ చేసింది. స్పేస్‌లో దాదాపు 27 వేల వస్తువులు ఉన్నట్లు గ్రహించింది. దీంట్లో 80 శాతం వరకు ఉపగ్రహ శిథిలాలే ఉంటాయని ఇస్రో పేర్కొన్నది. 10 సెంటీమీటర్ల కన్నా తక్కువ సైజ్‌లో ఉన్న వస్తువులు దాదాపు లక్షల సంఖ్యలో ఉంటాయని ఇస్రో చీఫ్ సోమనాథ్ తెలిపారు. యాంటీ శాటిలైట్ పరీక్షల ద్వారా ఏర్పడిన అంతరిక్ష వ్యర్థాలు కూడా ఎక్కువగా ఉన్నట్లు ఇస్రో అంచనా వేసింది. చైనా, అమెరికా, ఇండియా, రష్యాకు చెందిన పరీక్షల వల్ల ఆ వ్యర్థాలు ఏర్పడినట్లు తెలుస్తోంది. అంతరిక్షంలో వ్యర్థాలన్నీ జామ్ కావడం వల్లే.. జూలై 30వ తేదీన నిర్వహించిన పీఎస్‌ఎల్వీ పరీక్ష ఆలస్యమైందని ఇస్రో పేర్కొంది.